క్లుప్తంగా

విద్యార్థుల కోసమే పునర్వ్యవస్థీకరణ

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను చేపట్టిందని, ఆ దిశగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చర్చలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక మందిరంలో ఆయన జిల్లాలోని ఎంఈవోలు, అంగన్‌వాడీ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రస్తుత పాఠశాలల స్థితిగతులను ఆయన మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒకటవ తరగతికి అడ్మిషన్ పొందే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, జిల్లా విద్యాధికారి పీవీజె రామారావు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, ఎంఈవోలు, అంగనవాడి సూపర్‌వైజర్లు, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు ఎప్పుడందిస్తారు?



ఘంటసాల: సర్వేలంటూ సచివాలయ సిబ్బంది గ్రామంలో తిరుగుతుంటే కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సేవలు ఎప్పుడందిస్తారంటూ శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ అధికారులను ప్రశ్నించారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ వేమూరి రజని కుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సర్పంచ్ రవి ప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా)లు మాట్లాడుతూ శ్రీకాకుళం గ్రామం నుంచి సుమారు 4 కి.మీ. దూరంలో గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అక్కడకు వెళ్లడానికి ఎవరూ ఇష్టపడటం లేదన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు వాటిని రద్దు చేసి పంచాయతీ పరిధిలో ఇవ్వాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్పందించిన తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రతి రోజు సచివాలయ ఉద్యోగులతో వివిధ సర్వేలతో గ్రామాల్లో పర్యటిస్తున్నారని, సచివాలయానికి వచ్చే ప్రజలకు సమాధానం చెప్పేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ రవి చెప్పగా ఎంపీడీవో డి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా పనులు చేసేలా చెప్తామన్నారు. ఎంపీపీ వేమూరి రజని కుమారి మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పార్టీలకు అతీతంగా అందరూ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కాగా సర్వ సభ్య సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనలేదు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

మచిలీపట్నంటౌన్: పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా విజయవాడ నుంచి ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం సాయంత్రం మచిలీపట్నం చేరింది. నగర ముఖ ద్వారమైన మూడు స్తంభాల సెంటర్ ఫ్లైఓవర్ వద్ద పాదయాత్రికులకు స్థానిక ముస్లిం నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్రలో పాల్గొన్న నాయకులకు పూల మాలలు వేసి, స్వాగతం పలికారు. పాదయాత్రలో పాల్గొన్న ఆసిఫ్, ఆసిఫ్‌పాషా, శొంఠి నాగరాజు, ఇబ్రహీం, లతీఫ్, యూసఫ్‌ఖాన్‌లకు మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగ నాయకులు షేక్ మహమ్మద్ సాహెబ్, మహమ్మద్ రఫీ, జామియా మసీదు అధ్యక్షుడు అంజత్‌పాషా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ మతీన్, పలువురు టీడీపీ ముస్లిం నాయకులు బాజానీ, ఆరిఫ్ తదితరులు స్వాగతం పలికారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, జాతీయ పతాకాన్ని చేబూని, ప్లకార్డులతో ఈ పాదయాత్ర వక్ఫ్‌బిల్లు వ్యతిరేక నినాదాలతో ముందుకు సాగింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి పాదయాత్రగా వచ్చిన నాయకులు, ముస్లిం పెద్దలు వినతి పత్రాన్ని అందజేశారు.



జిల్లా కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

గూడూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముస్లింలు విజయవాడ నుంచి చేపట్టిన పాదయాత్ర శుక్రవారం గూడూరు మండలంలో సాగింది. పర్ణశాలలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన చేపట్టారు. సంఘ నాయకులు షేక్ ఆసిఫ్ పాషా, అబ్దుల్ లతీఫ్, మొహమ్మద్ రఫి, మహబూబ్ ఖాన్, ఆసిఫ్, ఇబ్రహీం, హన్ను తదితరులు పాల్గొన్నారు. గూడూరు చేరుకున్న పాదయాత్రను గూడూరు జామియా మసీదు కమిటీ ఘన స్వాగతం పలికింది.

హారిక దంపతులకు జగనన్న ఆశీస్సులు

పెడన: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము, హారిక దంపతులను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక జన్మదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాము, హారిక దంపతులు జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత మహాత్మజ్యోతీరావు పూలే చిత్రపటానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పూలు జల్లి నివాళులర్పించారు. అనంతరం హారిక జన్మదినాన్ని పురస్కరించుకుని రాము, హారిక దంపతులు జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఆశీస్సులు పొందారు.



రాము, హారిక దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి సహకారం అందించండి

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీతోపాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ రాజకీయపార్టీల ప్రతినిధులను కోరారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. గుడివాడ, మచిలీపట్నం గృహ సముదాయాలు, కరగ్రహారం లేఅవుట్లలోని గృహ సముదాయాలతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ లేఔట్లలోని గృహ సముదాయాలకు అవసరం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మేరకు నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం ప్రతినిధి కొడాలి శర్మ కలెక్టర్‌ను కోరారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)లకు ఓటుహక్కు కల్పించే విధంగా చూడాలని కోరారు. ఒకే వీధిలో ఉండే ఓటర్లందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండేలాగా తగిన చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అనుబంధ కమిటీల్లో జిల్లా నాయకులకు చోటు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో కృష్ణాజిల్లాకు చెందిన పలువురు నాయకులను ఆపార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.

స్టేట్ స్టూడెంట్ విభాగం ప్రధాన కార్యదర్శులుగా కోడే పండుప్రభు, చిటికిన వెంకటేష్, స్టేట్ పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పట్టపు నాగేశ్వరరావు, స్టేట్ పంచాయతీరాజ్ విభాగం సెక్రటరీలుగా నామా వెంకటేశ్వరరావు, నాయిడు బాలకృష్ణ, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా మీసాల సత్యవేదంశాస్త్రిలను నియమించారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

కోనేరుసెంటర్: నిమ్నజాతుల అభ్యున్నతికి జ్యోతిరావుపూలే చేసిన కృషి మరువలేనిదని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎస్పీ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సామాజికతత్వవేత్తగా పూలే ప్రజలను అనేక మార్గాల ద్వారా చైతన్యపరిచారన్నారు. అనాదిగా పాతుకుపోయిన కుల వివక్షను నిర్మూలించేందుకు జీవితాన్నే త్యాగం చేశారన్నారు. మహిళా విద్యా ప్రాముఖ్యతను తెలియజేస్తూ, వితంతు పునర్వివాహాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారన్నారు. బడుగు, బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపి వారి సాధికారత కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి జీవితం నేటి సమాజానికి ఆదర్శమన్నారు. దీనబంధు అనే పత్రిక ద్వారా పేదలు, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. విద్యా హక్కు కోసం చేసిన ఉద్యమం దేశచరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు.



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

ప్రజాస్వామ్య పరిరక్షణకు కదిలిరావాలి



చల్లపల్లి ప్రధాన సెంటర్లో ప్రసంగిస్తున్న సీపీఐ నాయకులు

చల్లపల్లి: దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రజలంతా కదిలి రావాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా శుక్రవారం చల్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సురేంద్రనాద్ బెనర్జీ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశం అన్నిరంగాల్లో తిరోగమనంలో పయనిస్తోందన్నారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.450 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.870 కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. విద్యుత్ ఛార్జీల భారం ప్రజలకు పెనుశాపంగా మారిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీజేపీకి దాసోహమైందన్నారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంఘ్‌పరివార్ శక్తులకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వ ఆ/్‌లను సీఎం చంద్రబాబు ప్రభుత్వం అమలుపరుస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడే సీపీఐ బలోపేతానికి ప్రజలంతా తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, నాయకులు చంద్ర సుబ్బారావు, కొర్రపాటి ముఖర్జీ, నక్కా శ్రీను, కొల్లూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

పెడన: బల్లిపర్రు డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఈ నెల 13వ తేదీన జరుగుతుందని ప్రిన్సిపల్ ఎన్.రూతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి వారికి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్‌లో ప్రవేశం వారికి పరీక్ష జరుగుతుందన్నారు.

విద్యుత్ శాఖాధికారులు దాడులు

అవనిగడ్డ: మండలంలో విద్యుత్‌శాఖాధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. మొత్తం 28 బృందాలతో మండలంలో 2,108 సర్వీసులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రూ.5,04,000 అదనపు లోడు చార్జీలు వసూలు చేసినట్టు డీఈ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి డీఈఈ పులి శివనాగేశ్వరరావు, ఉయ్యూరు డీఈఈ జి హేమకుమార్‌తో పాటు పలువురు ఏఈలు పాల్గొన్నారు.

వంశీమోహన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

గన్నవరం: సత్యవర్ధన్ కేసులో గన్నవరం మాజీఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ మరోసారి వాయిదా పడింది. విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. అయితే ఈ కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఏసీపీ, ప్రాసిక్యూషన్ తరుపున కళ్యాణి, రాజేంద్రప్రసాద్ వివిధ కారణాలు చూపుతూ కోర్టుకు హాజరుకాలేదు. బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగే ప్రతిసారి వివిధ కారణాలతో ఈ కేసులో కీలకమైన ఇన్వెస్టిగేషన్ అధికారి, ప్రాసిక్యూషన్ న్యాయవాదులు హాజరుకాక పోవడంపై పిటిషనర్ తరుపు న్యాయవాది దేవి సత్యశ్రీ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం బెయిల్ పిటిషన్‌పై విచారణను జాప్యం చేసేందుకు చూస్తున్నట్లుగా ఉందని సందేహం వ్యక్తపరిచారు. ప్రాసిక్యూషన్ న్యాయవాదులు సెలవులో ఉన్నప్పుడు కనీసం ఇన్‌చార్జ్‌ను పెట్టకపోవడం, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఏసీపీకి బదులుగా సీఐ కోర్టుకు రావడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. అనంతరం న్యాయమూర్తి ఈ కేసు విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేశారు.

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

బంటుమిల్లి: ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ (ఏఐకేఎస్) 90 ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని తెలిపారు. రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెడన నియోజకవర్గ కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు ఎల్. అజయ్‌ఘోష్, సీపీఎం మండల కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, బి. నాగరాజు తదితరులున్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని ఆందోళన

మచిలీపట్నంటౌన్: పెరిగిన వంట గ్యాస్ ధరలు పేదల పాలిట భారంగా మారాయని వెంటనే తగ్గించాలని సీపీఎం నగర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జలాల్‌పేటలో శుక్రవారం సీపీఎం మహిళా సంఘం నగర శాఖ కార్యదర్శి తమ్ము చాందిని దుర్గ ఆధ్వర్యంలో మహిళలు రోడ్లపైకి వచ్చి పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ప్రజల పక్షాన సీపీఎం అండగా ఉంటుందని చాందిని దుర్గ తెలిపారు. సీపీఎం నగర కమిటీ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేదల నుంచి వసూలు చేసిన పన్నులు ప్రజల సంక్షేమానికి వినియోగించాల్సిన ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా వనరులను పెట్టుబడిదారులకు దోచిపెట్టే విధంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీల కనుసన్నల్లో పనిచేస్తూ కార్పొరేట్ శక్తులు చేతుల్లో కీలుబొమ్మగా మారిందని ధ్వజమెత్తారు.

బహుజనుల ఆరాధ్య దైవం పూలే

అవనిగడ్డ: తొలిసామాజిక పోరాట యోధుడు జ్యోతీరావుపూలే జయంతి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల పక్షాన అలుపెరగని పోరాటం చేసిన గొప్పనాయకుడు పూలే అని కొనియాడారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: నాడు కొందరికే పరిమితమైన విద్య అందరి సొత్తు కావాలని పోరాడి విజయం సాధించిన మహాత్మా జ్యోతిరావు పూలే బహుజనుల ఆరాధ్య దైవమని పలువురు కొనియాడారు. కృష్ణాజిల్లా అగ్నికుల క్షత్రియుల నేత లకనం నాగాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బోసుబొమ్మ కూడలిలో పూలే జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ ఉప సర్పంచ్ తలశిల నరసింహారావు (నాని) పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోనేరుసెంటర్: మహిళలు విద్యారంగంలో రాణిస్తున్నారంటే ఆనాడు మహాత్మ జ్యోతిరావుపూలే చేసిన కృషి ఫలితమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావుపూలే జయంతిని శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్‌సిలార్‌దాదా, నగర పాలక సంస్థ మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్‌లు జోగి చిరంజీవి, బేత పూడి రవి తదితరులు పాల్గొన్నారు.


పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి


పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు


అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రాంజీ అధ్యాపకులు


పూలే విగ్రహానికి నివాళులర్పించిన కొనకళ్ల, కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు

మచిలీపట్నంటౌన్: దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావుపూలే అని ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాల సాధనకు యువత నడుం బిగించాలని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు పిలుపునిచ్చారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వలంద పాలెంలోని మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలే విగ్రహానికి నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

చల్లపల్లి: మహాత్మా జ్యోతిరావ్ పూలే 198వ జయంతి చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే అభిమాన సంఘం ఆధ్వర్యంలో తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెడన: అణగారిన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు జ్యోతీరావుపూలేనని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. జ్యోతీరావు పూలే జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మచిలీపట్నంఅర్బన్: సత్యశోధకుడు మహాత్మ జ్యోతిబా పూలే అందరికీ ఆదర్శమని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పీబీ సాల్మన్ రాజు అన్నారు. స్థానిక లేడీ యాంప్థిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి నిర్వహించారు.

రుద్రవరం (మచిలీపట్నం రూరల్): మహాత్మా జ్యోతిరావ్‌పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి శుక్రవారం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.రాంజీ మాట్లాడారు. విద్యాలయం ప్రాంగణంలోని అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసిన దాత బాపట్ల జిల్లా రేపల్లెలో ఐఆర్ఈఎఫ్ సంస్థ ద్వారా విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న డాక్టర్ రెబ్బా ఇమ్మానియేల్‌ను ఉపకులపతి ఆచార్య కె.రాంజీ సత్కరించారు. 40 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

మచిలీపట్నంటౌన్: బహుజనుల ఉన్నతికి నాడు ఎంతో కృషి చేసిన వ్యక్తి మహాత్మా జ్యోతీరావు పూలే అని పలువురు వక్తలు తెలిపారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి దళిత జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌బాబు(జానీ) మాట్లాడారు.

కోడూరు: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే నేటి యువతకు ఆదర్శనీయమని బీసీ సంఘ నేతలు అన్నారు. పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన సెంటర్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ఆర్ఐవో సాల్మన్‌రాజు


నాగాయలంకలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

335 మద్యం బాటిళ్ల పట్టివేత



నాగాయలంక: మండలంలోని ఈలచెట్లదిబ్బ గ్రామంలో గురువారం రాత్రి విజయవాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ బసవారావు నుంచి 335 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వసంత్, బసవరాజు, రాంబాబు, ఉష పాల్గొన్నారు.

రక్షిత పథకాలకు నీరు విడుదల

కమ్మనమోలు(నాగాయలంక): మండలంలోని 14 గ్రామాలకు తాగునీటిని అందించే సామూహిక రక్షిత నీటి పథకం రిజర్వాయర్‌లకు శుక్రవారం కృష్ణా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ఫీడింగ్ చానల్ నుంచి నీటిని విడుదల చేశారు. మండలి వెంకట్రామ్, నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు, ఇరిగేషన్ డీఈ పి. వెంకటేశ్వరరావు, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెడన: పురప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఈఈ సోమునాయుడు అన్నారు. శుక్రవారం ఆయన పెడన హెడ్ వాటర్ వర్క్స్‌ను, తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. తొలుత పెడన హెడ్ వాటర్ వర్క్స్‌లో పనులను పరిశీలించడంతో పాటు నీటి సరఫరాపై పెడన ఏఈ సీతారామాంజనేయులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. డీఈ ప్రవీణ్ ఉన్నారు.

కోడూరు: కాలువలకు విడుదల చేసిన నీటిని వెంటనే చెరువుల్లోకి మళ్లించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుధాప్రవీణ్ శుక్రవారం ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు నీటిని విడుదల చేశారని, సంబంధిత గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులతో పాటు ఊరచెరువుల్లోకి నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఘనంగా పోషకాహార పక్షోత్సవాలు

కృత్తివెన్ను: మండల పరిధిలోని చినపాండ్రక బీసీ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషకాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.శ్యామలగౌరి, వెంకటేశ్వరమ్మ, హెల్పర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

గూడూరు: పోషకాహారంతో చిన్నారుల్లో లోపాలు నివారించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ కె.గ్లోరి పేర్కొన్నారు. పోషన్ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని పోలవరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

అరిసేపల్లి(మచిలీపట్నం రూరల్): గర్భిణులు వెయ్యి రోజులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపర్‌వైజర్ విజయకుమారి అవగాహన కల్పించారు. చిన్నారులు ఊబకాయం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టిక ఆహారం అందించే విధానం గురించి తెలియజేశారు.

తాడేపల్లి(ఘంటసాల): అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి పోషణ్ పక్వాడ గురించి, పెరటి తోటలు ప్రాముఖ్యతను తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి మాట్లాడారు.

దాత సాయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కృత్తివెన్ను: మండల పరిధిలోని పల్లెపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రూ.1.65 లక్షలతో 500 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ప్లాంట్‌ను డొనేట్ చేసి కంపెనీ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు.

రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పెడన: మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను రెండు రోజుల అనంతరం ప్రారంభిస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో శనివారం విద్యుత్‌లైన్లు మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎ.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఈడేపల్లి, బస్టాండ్ వెనుక ఏరియా, రుస్తుంబాద, చెమ్మనగిరిపేట, బలరామునిపేట, కుమ్మరిగూడెం, మూడు స్తంభాల సెంటర్, వర్రెగూడెం దేశాయిపేట, చింతచెట్టు సెంటర్, బందరు కోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కోడూరు: అవనిగడ్డ 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ కోత విధించనున్నట్లు ఆ శాఖ ఈఈ శ్రీకృష్ణనాయక్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు కోడూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కోత ఉంటుందన్నారు. సబ్‌స్టేసన్ మరమ్మతులతో పాటు కోడూరు లైన్‌పై వాలిన చెట్లను కూడా ట్రిమ్ చేయనున్నట్లు ఈఈ చెప్పారు.

సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

బంటుమిల్లి: వ్యవసాయంలో రైతులు రసాయినిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఎన్ఎఫ్ఏ నాగేశ్వరరావు అన్నారు. చినతుమ్మిడి, సాతులూరు గ్రామాల్లో శుక్రవారం 32 రకాల పచ్చిరొట్ట విత్తనాలు (పీఎండీఎస్)పై అవగాహన కలిగించారు.

దాలిపర్రు(ఘంటసాల): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు, ప్రజలకు ఆదాయం, ఆరోగ్యం వస్తాయని దాలిపర్రు సర్పంచ్ దోకిపర్తి శాంత కుమారి తెలిపారు. ఘంటసాల దాలిపర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంలో కేపీపీ యాక్షన్ ప్లాన్ - 2025 గ్రామ సభ శనివారం నిర్వహించారు.



లంకమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధం

అవనిగడ్డ: దివిసీమ భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఆ తల్లి. గ్రామంలో ఏ శుభ కార్యం జరిగినా ముందుగా అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటారు. దివిసీమ ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న అవనిగడ్డ లంకమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధం చేశారు. వందల సంవత్సరాల క్రితం కృష్ణానదికి వచ్చిన వరదలకు గుంటూరు జిల్లా నుంచి ఒక రూపంలో అమ్మవారు ఈ ప్రాంతానికి చేరినట్టు చెప్పుకుంటారు. వరదలకు కొట్టుకొచ్చిన లంకమ్మ అమ్మవారు తాను ఆగినచోట పుట్టను ఏర్పాటు చేసుకుని ఆవాసమైనట్టు పెద్దలు చెబుతారు.

ప్రతిసంవ్సరం చైత్ర పౌర్ణమి రోజున జాతర....

ప్రతిసంవత్సరం చైత్ర పౌర్ణమిరోజున అమ్మవారి జాతర నిర్వహిస్తారు. అమ్మవారి సోదరుడైన పోతురాజుకు ముద్దుల చెల్లెలుగా పేరొందిన అమ్మవారు చైత్ర మాసంలో నిర్వహించే గ్రామోత్సవ తొలిపూజను పోతురాజు వంశస్థుల ఇళ్ల వద్దకు వెళ్లి పసుపు కుంకుమలు అందుకుని ఉత్సవం ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుంది. అనంతరం అమ్మవారిని ప్రతి వీధికి తీసుకెళ్లి పసుపు, కుంకుమ నీరు ఓరపోయించి పూజలు చేస్తారు. దివిసీమతో పాటు కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటారు. గ్రామంలో ఏ శుభ కార్యం జరిగినా ముందుగా అమ్మవారిని దర్శించుకుని తరువాత కార్యక్రమాలు ప్రారంభించుకుంటారు.

నేడు అమ్మవారి జాతర....

అమ్మవారి జాతర మహోత్సవంకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు చెప్పారు. ఆలయానికి ప్రత్యేక రంగులు వేయించడంతో పాటు రంగు రంగుల విద్యుద్దీపాలతో ఎంతో సుందరంగా అలంకరించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి వసతిని కల్పించారు.


లంకమ్మ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట గ్రామంలో వేంచేసి ఉన్న సీతా సమేత కోదండరామాలయంలో సామూహిక కుంకుమ పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ సౌజన్యంతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలను పండితులు బృందావనం వేణుగోపాలాచార్యులు వేద మంత్రాల మధ్య వైభంగా చేశారు. దర్మ ప్రచార పరిషత్ ప్రతినిధి తురగా ప్రసాదు పర్యవేక్షించారు తొలుత ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



చల్లపల్లి: శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోపిదేవి మండల పరిధిలోని కె.కొత్తపాలెం కృష్ణానది తీరం వద్ద స్వామి వారికి ఆరాట్టు మహోత్సవాలు నిర్వహించారు. నదీ జలంలో వేదిక ఏర్పాటుచేసి స్వామివారి ఆరాట్టు విగ్రహానికి నవవిధ అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకులు భానూ నంబూద్రి ఆధ్వర్యంలో కేరళతాంత్రిక పద్ధతిలో విశేష పూజలు జరిపించారు.

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీవాసవి క్షేత్రంలో శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి ఉపాళయంలో శుక్రవారం అయ్యప్పస్వామి వారికి 21 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనులపండువగా కల్యాణోత్సవం

గూడూరు: ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటాచల స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కనులపండువగా సాగింది. శుక్రవారం సాయంత్రం జగజ్యోతి, ఎదుర్కోల సన్నాహాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ తిమ్మరాజు కృష్ణకాంత్, విజయదుర్గ దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి దివ్య కల్యాణం ఘనంగా సాగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.వి.వి.మోహనరావు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు నాంచారమ్మ అమ్మవారి నెలసంబరం

కోడూరు: కృష్ణా తీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి నెల సంబరాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి జయశ్రీ శుక్రవారం తెలిపారు. అమ్మవారి ప్రధాన జాతర పూర్తి అయి నెల రోజులు పూర్తి కావడంతో మళ్లీ నెలసంబరాన్ని జరపుతున్నట్లు చెప్పారు. ఉదయం కొండవీటి వంశీయుల ప్రత్యేక పూజలనంతరం అమ్మవారికి మహిళలచే నైవేద్యాల సమర్పణ అంటుందని జయశ్రీ చెప్పారు.

వైభవంగా సీతారామస్వామి విగ్రహాలు పునప్రతిష్ట

చిన్నాపురం(మచిలీపట్నంరూరల్): సీతారామ స్వామి యంత్ర విగ్రహ, దేవాలయం పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మండల పరిధిలోని చిన్నాపురం గ్రామపంచాయతీలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొని స్వామివార్ల నూతన విగ్రహాలను దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ అంగడాల ఫణికుమార్, గగాని, పూర్ణచంద్రరావు, తెనాలి అశ్వని, తెనాలి వెంకటేశ్వరరావు, రిటైర్ ఎస్ఐ గుమ్మడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.